క్లుప్తంగా

నిత్యావసరాల అందజేత



సంఘమేశ్వరరావును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని మోనింగివారి వీధికి చెందిన సైలాడ సంఘమేశ్వరరావు ఇంట్లో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించింది. ఇంట్లో ఉన్న అన్ని వస్తువులూ కాలిపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఆ కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. నెల రోజులకు సరిపోయే నిత్యావసర సరుకులు అందజేశారు. పార్టీ నాయకుడు సైలాడ దాసునాయుడు, కార్యకర్తలు ఉన్నారు.

బోరు ఏర్పాటు



బోరు తవ్వకానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

కొత్తూరు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సర్పంచ్ పడాల కృష్ణవేణి, భర్త లక్ష్మణరావు తమ సొంత నిధులతో శనివారం తాగునీటి బోరును తవ్వించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీటి కొరతను తీర్చేందుకే బోరును ఏర్పాటు చేస్తున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. బోరు తవ్వకానికి సర్పంచ్ భూమి పూజ చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

సారా తయారీకి దూరంగా ఉండాలి



హడ్డివాడలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

మెళియాపుట్టి: సారా మహమ్మారి వలన ఎన్నో జీవితాలు నాశనమవుతున్నాయని, సారా తయారీ, క్రయవిక్రయాలు మానుకోవాలని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు అన్నారు. శనివారం హడ్డివాడ గ్రామంలో గిరిజనులకు అవగాహన కల్పించారు. మత్తుకు దూరంగా ఉండాలని, నాటుసారా అత్యంత ప్రమాదకరమన్నారు. గిరిజన గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తయారు చేయడమే లక్ష్యంగా నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సారా తయారీ చేస్తే గిరిజనులకు ఇచ్చిన పోడు పట్టాలు రద్దు చేస్తామన్నారు. గిరిజనులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో నేల సారవంతం



మూలసవలాపురంలో కంపోస్ట్ పిట్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ

సరుబుజ్జిలి: కంపోస్ట్ పిట్‌లు అధికంగా ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ ఏపీడీ పంచాది రాధ తెలిపారు. మండలంలోని మూలసవలాపురం, తురకపేట గ్రామాల్లో నిర్మిస్తున్న కంపోస్ట్ పిట్‌లను శనివారం పరిశీలించారు. సేంద్రియ వ్యర్థాలను కుళ్లించి ఎరువుగా మార్చేందుకు కంపోస్ట్ పిట్‌లు ఉపయోగపడతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియలో వ్యర్థాల్లోని సూక్ష్మజీవుల ద్వారా విచ్ఛిన్నమై నేల సారవంతంగా మారుతుందన్నారు. ఈ పరిశీలనలో వెలుగు ఏపీఎం గోవిందరాజులు, ఏపీఓ బొత్స పార్వతి, ఈసీ రమాదేవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉంటే తెలియజేయాలి

హిరమండలం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎంపీడీఓ కాళీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. నీటి ఎద్దడిపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయిలో మోనటరింగ్ సెల్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే 88018 50001 నంబర్‌ను సంప్రదించాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా చూసుకునే బాధ్యత అధికారులు, సిబ్బంది చూసుకోవాలన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

పాతపట్నం/హిరమండలం: శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పాతపట్నం సీఐ వి.రామారావు, హిరమండలం ఎస్ఐ ఎం.డి.యాసిన్ శనివారం తెలిపారు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం మండలాలు ఒడిశాకు సరిహద్దు ప్రాంతం కావడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా తనిఖీలు కొనసాగిస్తున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు రాత్రిపూట గస్తీ పెంచుతున్నట్లు చెప్పారు. రాత్రి 11 గంటలు దాటిన తరువాత అనవసరంగా ఎవరూ బయట తిరగవద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో బయటకు వచ్చేవారు అందుకు తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందని, ప్రజలందరూ సహకరించాలని సీఐ కోరారు.

భానుడి భగభగలు



నిర్మానుష్యంగా ఉన్న రైల్వే స్టేషన్ జంక్షన్

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం ఖాళీగా దర్శనమిస్తున్న రహదారులు
- ఎండ తీవ్రతకు బయటకు రావటానికి జంకుతున్న ప్రజలు

ఆమదాలవలస: ఏప్రిల్ మొదటి వారంలోనే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండలు తీవ్రం కావడంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ఆమదాలవలస పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో జనసంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. శనివారం మధ్యాహం 36 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో.. వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఆమదాలవలస పట్టణ ప్రధాన రహదారి, రైల్వే స్టేషన్ జంక్షన్, వన్ వే ట్రాఫిక్ రోడ్డు జంక్షన్, కృష్ణాపురం జంక్షన్, వైఎస్సార్ కూడలి, ఆమదాలవలస గేట్ వంటి ప్రాంతాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ ఉష్ణోగ్రతలు గత వారం రోజులుగా ఇలాగే నమోదయ్యాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, కార్మికులు, ఆటో, రిక్షా కార్మికులు ఎండ వేడిని తట్టుకోలేక చెట్ల నీడన సేద తీరుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా బయటకు వెళ్లే ప్రజలకు పలు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచనలు చేస్తున్నారు. గొడుగు, టోపీ, స్కార్ఫ్ ధరించి బయటకు వెళ్లాలని, కాటన్ (లేత రంగు) దుస్తులు ధరించడంతోపాటు, విటమిన్-ఎ, సీ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని చెబుతున్నారు. వీటితోపాటు రోజుకు 4 నుంచి 5 లీటర్ల మంచినీరు తాగాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



గొడుగు నీడలో వెళ్తున్న మహిళలు



చెట్టు కింద సేదతీరుతున్న ప్రయాణికులు

ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది

ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. ఏప్రిల్ మొదటి వారంలో ఎండలు 35 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ ఏడాది మరో రెండు నెలల వరకు ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి వేళల్లో మంచు కురుస్తూ పగటిపూట ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉంది. సముద్ర ఉపరితలంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితులతోపాటు, పర్యావరణాన్ని పరిరక్షించే చెట్లను నాశనం చేయడంతోనే ఎండల తీవ్రత అధికంగా ఉంది.

– డాక్టర్ జి.జగన్నాథరావు, నైర వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, శాస్త్రవేత్త

జాగ్రత్త వహించాలి



ప్రస్తుతం రోజురోజుకూ ఎండల తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదముంది. వీరిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఓఆర్ఎస్, పలుచని మజ్జిగతోపాటు మంచినీళ్లు ఎక్కువగా అందించాలి. బయటకు పనులపై వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యం విషయంలో కొంచెం తేడాగా ఉన్నా, నీళ్ల విరోచనాలు, వాంతులు, వికారం వంటి లక్షణాలు కనిపించినా వెంటే అందుబాటులో ఉండే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ స్రవంతి, తొగరాం పీహెచ్‌సీ వైద్యురాలు, ఆమదాలవలస

కుంకుమార్చనలు



జలుమూరు మండలంలోని లింగాలవలస పంచాయతీ పరిధి హరిక్షమ్మపేటలో గల కోదండ రామస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి తిరువీధి, సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. – జలుమూరు

భక్తిశ్రద్ధలతో..



ఆమదాలవలస మండలంలోని పొన్నాంపేటలో శ్రీరామనవమి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం వేద పండితులు ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ పూజల్లో గ్రామానికి చెందిన మహిళలు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. - ఆమదాలవలస

తనిఖీలు



బూర్జ మండలంలోని కొల్లివలస, ఉప్పినివలస గ్రామాల్లోని పలు దుకాణాల్లో స్థానిక పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో శనివారం తనిఖీలు చేపట్టారు. నిషేధిక మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలతో ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్ఐ ఎం.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు. -బూర్జ

గ్రామాల్లో భక్తిభావం పెరగాలి



కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న నాయకులు, గ్రామస్తులు

జలుమూరు: సప్తాహ వంటి భజన కార్యక్రమాలతో గ్రామాల్లో భక్తిభావం పెరుగుతుందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పాగోడు పంచాయతీ వెలుసోదలో శ్రీరామ ఆలయ ధర్మకర్త, సప్తాహ కార్యక్రమ నిర్వహకుడు తండ్యాల జగన్నాథంను అభినందించారు. పాగోడు శివాలయంలో కల్యాణం, నిర్వహణలో బాధ్యత తీసుకుంటున్న జగన్నాథం పలువురికి ఆదర్శమన్నారు. అనంతరం పలు భజన బృందాల గురువులను కృష్ణదాస్ సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్‌ను పార్టీ నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, సర్పంచ్‌లు దామ మన్మధరావు, జుత్తు నేతాజీ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, కనపల శేఖర్, తోట భార్గవ్, బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్



నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నిమ్న జాతులతోపాటు బీసీ వర్గాల అభ్యున్నతికి బాబూ జగజ్జీవన్‌రామ్ జీవితాంతం కృషి చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పలువురు వక్తలు అన్నారు. ఉప ప్రధానిగా, పలు శాఖలకు మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జైభీమ్ యువజన సంఘం సభ్యులు



బూర్జ: కొల్లివలస డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది



బూర్జ: ఎంపీడీఓ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది



సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది



పాతపట్నం: కోర్టు కూడలి వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు



ఆమదాలవలస: కొల్లివలసలో జగ్జీవన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్రిస్టియన్ సంఘం ప్రతినిధులు

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీఓ, అధికారులు, రైతులు

ఆమదాలవలస: గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఆర్డీఓ సాయి ప్రత్యూష అన్నారు. మండలంలోని కట్యాచార్యులపేటలో రెండో విడత రీసర్వే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రీ సర్వేపై గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. వివాదాలున్న భూముల విషయంలో ప్రత్యేక డీటీ శ్రీనివాసరావును సంప్రదించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులున్నా గ్రామ సభల్లో ఆర్జీలను అందించాలన్నారు. తహసీల్దార్ పి.రాంబాబు, రీ సర్వే డీటీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, గ్రామ సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులు..



రేకింటిపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం

మెళియాపుట్టి: మండలంలో శనివారం సాయంత్రం భారీ గాలులు వీచాయి. తూముకొండరామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రేకింటిపైకి విద్యుత్ స్తంభం ఒరిగింది. ఆ సమయంతో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈదురు గాలులకు ఆకులమ్మ గుడి సమీపంలో విద్యుత్ తీగలు తెగిపోయాయి. హీరాపురం, తూముకొండ, పెద్దమడి, ఎర్రగడ్డ, చీపురుపల్లి గ్రామాలకు సుమారు 5 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నేటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

పాతపట్నం: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు మండలంలోని పెద్దలోగిడి గ్రామంలో గల కోదండరామస్వామి, అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. పాతపట్నం, కాగువాడ, లాబర, తెంబూరు, పెద్దసరియాపల్లి, సరాలి గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో నవమి వేడుకల్లో భాగంగా మూడు రోజుల పాటు వివిధ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు పెరిగాయన్నారు. కూటమి నాయకులు చట్టాన్ని వారి చేతుల్లోకి తీసుకున్నారన్నారు. వారికి నచ్చిన అధికారులను నియమించుకుని అనేక అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి నాయకులు చెప్పిన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇలాంటి పాలన గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు.. ఆ పథకాలను ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. అధికారం చేపట్టి పది నెలలు పూర్తయినా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం ఎందుకు కల్పించలేదన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు రూ.1,500 ఎప్పుడు ఇస్తారన్నారు. నిరుద్యోగులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. పాతపట్నం నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.

రెడ్డి శాంతికి అభినందనలు



మెళియాపుట్టి: రెడ్డి శాంతిని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: రెడ్డి శాంతికి అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

మెళియాపుట్టి: వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా ఇటీవల నియామకమైన పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మెళియాపుట్టి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. శనివారం పాతపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో కలిసి సత్కరించారు. పార్టీ రాష్ట్ర కమిటీలో రెడ్డి శాంతికి అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రెడ్డి శాంతిని సత్కరించిన వారిలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, పార్టీ మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, పార్టీ సీనియర్ నాయకుడు శశిభూషణ్ రావు, వైస్ ఎంపీపీ ఆదినాయుడు, కోఆప్షన్ సభ్యులు భాస్కరదాస్, సర్పంచ్‌లు రామచంద్ర మజ్జి, యవ్వారి ఈశ్వరరావు, పార్టీ నాయకులు అలికాన మాధవరావు, సవర సుభాష్, కొల్లాన ఆనందరావు, పరపటి యోగీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి శాంతికి సత్కారం..

కొత్తూరు: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యురాలిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల నియమించారు. పాతపట్నంలోని రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయంలో కొత్తూరు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం అభినందనలు తెలిపారు. నివగాం మాజీ సర్పంచ్ టంకాల రమణారావు, నివగాం మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాడ రాజు, బుజ్జి తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం



సర్టిఫికెట్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు

నరసన్నపేట: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే సత్యసాయి సేవా సంస్థల ధ్యేయమని జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు అన్నారు. స్థానిక చిత్తిరి వీధిలోని సత్యసాయి పెద్ద మందిరంలో గత 50 రోజులుగా కంప్యూటర్ శిక్షణ శిబిరం (ఉచితంగా) సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. దీంట్లో శిక్షణ పొందిన యువతీ, యువకులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ఉపాధి పొందాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండో బ్యాచ్‌ను ప్రారంభించారు. ఉపాధి శిక్షణ శిబిరాలు బాధ్యతగా నిర్వహిస్తున్న మందిరం కమిటీ సభ్యులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సమితుల ప్రతినిధి బోయిన నర్సింహమూర్తి, చిత్తరి వీధి సాయి మందిరం కన్వీనర్ నాగేశ్వరరావు, ప్రతినిధి చిత్తిరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

జలుమూరు: మండలంలోని కూర్మనాథపురం గ్రామానికి చెందిన రెడ్డి అప్పారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అప్పారావును వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శనివారం పరామర్శించారు. కత్తిరివానిపేటకు చెందిన కరణం వెంకటరమణ తల్లి ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, దామ మన్మధరావు, ధర్మాన జగన్, కృష్ణ, జుత్తు నేతాజీ తదితరులు ఉన్నారు.

పరామర్శ..

హిరమండలం: మండల ఉపాధ్యక్షురాలు వంగపల్లి సావిత్రి భర్త చిన్నారావు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. చొర్లంగిలోని చిన్నారావు ఇంటికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామకృష్ణ, అల్లు శంకరావు, యోగి, తదితరులు ఉన్నారు.